క్లుప్తంగా

వైభవంగా సంతోషిమాత పుట్టిన రోజు వేడుకలు

అల్లిపురం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా చలువతోటలో వెలసిన సంతోషిమాత అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారితో సోదరుడు గణపతికి రాఖీ కట్టించిన వేడుక భక్తులకు కనువిందు చేసింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

గాజుల అలంకరణలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి మూల విరాట్టు

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారు శనివారం శ్రావణ పూర్ణిమ సందర్భంగా భక్తులకు గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పసుపు కొమ్ములు, గాజులు, మందార పువ్వులతో ఆలయ అర్చకుడు జోగారావు శర్మ అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.రమాబాయి మాట్లాడు తూ అమ్మవారి దేవస్థానంలో ఆశ్వయుజ పౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు పంచ పౌర్ణమి వేడుకలు వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు.

బల్లిగిరి వెంకన్నకు శ్రవణా నక్షత్ర పూజలు



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న ఈవో రమాబాయి, భక్తులు

అల్లిపురం: బల్లిగిరి వెంకన్నకు శ్రావణ పౌర్ణమి, శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి దేవాలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు ఏడు సోమవారాల పూజలు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం మండపంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన టేకు మందిరాన్ని ప్రారంభించారు. స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై విచారణ జరపాలని ఆందోళన

బీచ్‌రోడ్డు: దేశంలో ఇటీవల ఎన్నికల సంఘం నిర్వహించిన అనేక రాష్ట్రాల, పార్లమెంట్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జేటీ రామారావు డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదే పదే ఎన్నికల సంఘంపై ఆరోపణలు వస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. రాహుల్ గాంధీ అనేక సార్లు పార్లమెంట్‌లో ప్రశ్నించినప్పటికీ బీజేపీ నాయకులు, కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పలేక సభను వాయిదా వేసుకుంటున్నారని ఆరోపించారు. సాయంత్రం 5 గంటల తర్వాత పెద్ద ఎత్తున పోలింగ్ జరగటంపై చాలా అనుమానలు ఉన్నాయని, దానికి సంబంధించిన సీసీ ఫుటేజ్ ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామచంద్రమూర్తి, తాతారావు, నీలకంఠం, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

జాలాదికి ఘన నివాళి

దాబాగార్డెన్స్: సినీ గేయ రచయిత జాలాది రాజారావు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాలాది జయంతిని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో ఉన్న జాలాది విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిపంతులుగా జీవితాన్ని ప్రారంభించి, 1970లో మద్రాసు వెళ్లి రంగస్థలానికి ఘోస్ట్ రైటర్‌గా పని చేశారన్నారు. సుమారు 275 సినిమాలకు ఎన్నో పాటలు రాసి, తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. సినీ సాహితీ రంగంలో సేవలందించిన జాలాదికి పద్మశ్రీ అవార్డు వచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జాలాది శ్రీనివాసరావు, జాలాది విజయ, నిర్మల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమకు ప్రతీక..రాఖీ వేడుక

- అన్నదమ్ములకు రక్షాబంధన్ కట్టి వేడుక చేసిన అక్కాచెల్లెళ్లు
- ప్రేమసమాజంలో ఘనంగా వేడుకలు
- దక్షిణలో పలుచోట్ల సంబరాలు



వాసుపల్లికి రాఖీ కడుతున్న మహిళలు



ప్రేమసమాజం పిల్లలతో రాఖీ కట్టించుకుని వారికి వాచీలు బహూకరిస్తున్న దొడ్డి బాపూ ఆనంద్

దాబాగార్డెన్స్: అక్కా చెల్లెళ్లు.. అన్నదమ్ముల అనుబంధమే రక్షాబంధన్. నియోజకవర్గ పరిధిలో రాఖీ పండగ సందర్భంగా అక్కా చెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కట్టి సోదరాభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా రాఖీలకు గిరాకీ పెరిగింది. నగరంలో ఎక్కడ చూసినా రాఖీ విక్రయాలు జోరుగా సాగాయి.

ప్రేమసమాజంలో..

వారంతా అక్కా చెల్లెళ్లు.. అన్నా తమ్ముళ్లలా కలిసిమెలిసి ఉంటున్నారు. వీరు ఎక్కడి వారో.. ఏ తల్లికి పుట్టిన బిడ్డలో తెలియదు కానీ.. వారికి ప్రేమసమాజం అండగా ఉంటే.. అక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ప్రతి ఏటా వచ్చే రాఖీ పండగ రోజున ఎందరో వృద్ధులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించుకుని వేడుకలు జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా అలాగే చేశారు. బయటి నుంచి వెళ్లిన వారు కూడా వారికి రాఖీ కట్టి మీకు మేమున్నామంటూ భరోసా కల్పించారు.

వాసుపల్లి కార్యాలయంలో..

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యాలయంలో శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ మహిళలు వాసుపల్లికి రాఖీ కట్టి స్వీట్స్ తినిపించారు. వాసుపల్లి నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని పలువురు అక్కా చెల్లెమ్మలు అభిలషించారు. వాసుపల్లి మాట్లాడుతూ రక్షాబంధన్ పవిత్ర పండగ అని పేర్కొన్నారు. తోబుట్టువులందరికీ ఈ వేడుక ఒక మంచి సందేశాన్ని అందిస్తుందన్నారు. తోబుట్టువులకు తోడుగా ఉంటూ వారికి అండగా నిలవడమే అన్నదమ్ములకు ఆదర్శమన్నారు. రాష్ట్రంలో మహిళలపై పెచ్చుమీరుతున్న దాడులకు అడ్డుకట్ట వేయాలన్నారు. నియోజకవర్గంలో తనపై ప్రేమాభిమానాలు చూపించే అక్కా చెల్లెమ్మలకు వాసుపల్లి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. వారికి ఎప్పుడూ.. అన్నగా అండగా నిలవడమే బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షబీర బేగం, సలాది భవానీ, వలిశెట్టి లక్ష్మి, రోజా, రమణి, కుమారి, ఆదిలక్ష్మి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రంలో..

ఏవీఎన్ కళాశాల డౌన్‌రోడ్డులో ఉన్న ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రంలో స్వామి వివేకానంద సంస్థ మహిళలు, ట్యూషన్ పిల్లలు రాఖీ సందడి చేశారు. కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే కేంద్రంలో రక్షా బంధన్ వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నామని, కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారు ఎవరూ అనాథలు కాదని, వారికి తోడుగా మేమున్నామని భరోసా కల్పించారు. వివేకానంద సంస్థలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు కూడా రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు, ట్యూషన్ పిల్లలు పాల్గొన్నారు.

పిల్లల నడుమ రాఖీ సంబరం..

జీవీఎంసీ 31వ వార్డు పరిధిలో ఉన్న ప్రేమసమాజంలో పిల్లల మధ్య దేవకీ నంద ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి బాపూ ఆనంద్ రాఖీ సంబరం నిర్వహించారు. పిల్లలచే రాఖీలు కట్టించుకుని, వారికి స్వీట్లు తినిపించారు. పిల్లలకు వాచీలు బహూకరించారు.

అంబికాబాగ్ రామాలయంలో..

జగదాంబ జంక్షన్ దరి మహారాణిపేట అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద రాఖీ సందడి నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన పెదనాన్న.. చిన్నాన పిల్లలంతా రాఖీలు కట్టుకుని ఆనందంగా గడిపారు.



అంబికాబాగ్ రామాలయ ప్రాంగణంలో అన్నదమ్ములకు రాఖీలు కడుతున్న అక్కచెల్లెళ్లు

ప్రకృతి చికిత్సాలయంలో..

మహారాణిపేట: మహారాణిపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయంలో రాఖీ సందడి నెలకొంది. శిష్టా శ్రీలక్ష్మి, శివ భగవాన్ దివ్యజ్ఞాన మందిరానికి చెందిన వారు బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపాకుల రవికుమార్‌కు, జయంతి ఫణి రక్షిత్‌కు, శ్రీహరికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ద్రౌపది శ్రీకృష్ణుడికి రక్షాబంధన్ కట్టి అండగా నిలవాలని కోరిందని తెలిపారు.

ఏయూటీడీలో..

అల్లిపురం: ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న షెల్టర్లలో ఉంటున్న నిరాశ్రయ మహిళలు తమ సహచరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు. స్వీట్లు తినిపించుకున్నారు. వారికి ఎవరూ లేరన్న భావం కలగకుండా రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు లీలా, శ్రీనివాస్, నిరాశ్రయులు పాల్గొన్నారు.



సోదరురుడికి రాఖీ కడుతున్న క్షీరాబ్దిదుతి

వెంకటేశ్వరమెట్టపై వీధి దీపాలు వెలిగాయి



సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై వీధి దీపాలు వెలగడం లేదని శనివారం 'అంధకారంలో వెంకటేశ్వర మెట్ట' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది స్పందించారు. దీంతో శనివారం సాయంత్రం వీధి దీపాలు వెలగటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

సిరులతల్లికి శ్రావణలక్ష్మి పూజలు



తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజల్లో శనివారం 18 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసి పూజ..

సిరులతల్లికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రీచక్ర నవావర్ణార్చన, లక్ష్మీ హోమంలో ఇద్దరు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఈవో శోభారాణి తెలిపారు.

42వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న భీశెట్టి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 42వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. 1వ నంబర్ పోలింగ్ బూత్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి బాబు చేసిన మోసాలను ప్రతి ఒక్కరికి నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ సౌత్ ప్రెసిడెంట్ రాజపాత్ర, వార్డు ఉపాధ్యక్షుడు రియాజ్ ఖాన్, కె.వి.ఆర్. మూర్తి, ముస్లిం మైనార్టీ కార్యవర్గ సభ్యులు హైదర్ అలీ ఖాన్, పుల్లెట్యుర్తి శ్రీనివాస్, నాగమణి, కంబాల మురళీకృష్ణ, చిన్ని, షీలా గణేష్, జయ తదితరులు పాల్గొన్నారు.

సరళమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు

దాబాగార్డెన్స్: సరళమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు పొందవచ్చని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే విధానం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్ ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సరళమైన పద్ధతిలో బోధించాలన్నారు. విద్యార్థుల మనస్తత్వాన్ని తెలుసుకుని బోధన చేయగలిగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చాన్నారు. కేంద్ర ప్రభుత్వం డీఎల్ఈడీ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే వారని, ప్రస్తుతం జరగడం లేదని, వాటిని మళ్లీ తిరిగి అమలు చేయాలని, ఈ విషయంపై తగు చర్యలు చేపట్టాలని పీవీఎన్ మాధవ్‌కు అసోసియేషన్ తరఫున చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, కార్యదర్శి యు.సురేష్, కోశాధికారి శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు, వివిధ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవీఎన్ మాధవ్

స్త్రీ శక్తి పథకం అమలుకు చురుగ్గా ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న స్త్రీ శక్తి (మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం) పథకం అమలుకు ఏపీ ఎస్ఆర్టీసీ ద్వారకాబస్టేషన్‌లో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై జిల్లాలో బస్సులు, బస్టేషన్ మెయింటెనెన్స్‌పై జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు శనివారం సమీక్షించారు. ద్వారకా బస్ స్టేషన్లో నూతనంగా బెంచీలు, ఫ్యాన్ల ఏర్పాటు, స్టేషన్ ప్రాంగణం, టాయ్‌లెట్ల శుభ్రతపై తగు ఆదేశాలిచ్చారు. స్త్రీ శక్తి పథకాన్ని ప్రముఖులు ప్రారంభించనున్న నేపథ్యంలో అందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు శరత్‌బాబు, ఎస్ఎస్ నాయుడు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

విద్యార్థుల క్విట్ ఇండియా ఉద్యమ ర్యాలీ

దాబాగార్డెన్స్: ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు శనివారం క్విట్ ఇండియా ఉద్యమ ర్యాలీ చేపట్టారు. 1942 ఆగస్టు 9న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన ర్యాలీ డాబాగార్డెన్స్, అల్లిపురం పరిసర ప్రాంతాల్లో సాగింది. ర్యాలీ పొడవునా విద్యార్థులు, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వరాజ్యం మా జన్మహక్కంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర రీజినల్ మేనేజర్ పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కడారి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌పీ బాబ్జి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.భాస్కరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.శ్రీనివాసరెడ్డి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పేదలకు చీరల పంపిణీ.. రక్తదానం

దాబాగార్డెన్స్: సూపర్ స్టార్ మహేష్‌బాబు జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం సరస్వతీ పార్క్ వద్ద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ సిటీ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేషకుమార్ పాల్గొని పేదలకు దుస్తులు అందజేశారు. అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమ నిర్వాహకుడు బీసీహెచ్ అప్పారావు, అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాజాబాబు, ఇ.విజయ్ (చిన్నారి), అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. అలాగే చిన్న దుర్గాలమ్మ గుడి వద్ద బుజ్జి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహేష్‌బాబు జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని పేదలకు చీరలు పంపిణీ చేశారు. అలపన కనకరెడ్డి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండా రమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు అందజేస్తున్న వాసుపల్లి, అభిమానులు

ఐద్వా మహాసభలు జయప్రదం చేయండి

దాబాగార్డెన్స్: ఈ నెల 11న మద్దిలపాలెం సవేరా ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న ఐద్వా విశాఖ జిల్లా 17వ మహాసభలను జయప్రదం చేయాలని విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, కార్యదర్శి వై.సత్యవతి పిలుపునిచ్చారు. శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన ఉన్న ఎన్‌పీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారంలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఐద్వాకు రెండు లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. స్త్రీల పట్ల జరిగే సాంఘిక దురాచారాలు ఎదుర్కోవడంలో ఐద్వా ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ మూడేళ్ల కాలంలో నిర్వహించిన కార్యక్రమాలు సమీక్షించుకుని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఐద్వా ప్రతినిధులు తెలియజేశారు.